RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 10 సంచిక : 229 సోమవారం 17 - 03 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయున వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

## మా ప్రభుత్వం వచ్చాకే.. వరంగల్‌కు

# ఎయిర్‌పోర్ట్, రింగ్‌రోడ్డు వచ్చాయి...

★ ఆయన రూ.800 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

★ రూ. 800 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు.

★ అసెంబ్లీకి రాకుండా కేసీఆర్ రూ.58 లక్షలు జీతం తీసుకున్నాడన్నారు.

★ నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను ప్రారంభించారు.

★ రూ.25.6 కోట్ల వ్యయంతో స్టేషన్‌ఘన్‌పూర్ నియోకవర్గంలో 750 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు




హైదరాబాద్ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా.. ఆయన రూ.800 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వీటిలో ముఖ్యంగా రూ.2 కోట్లతో బంజారా భవన్ నిర్మాణం, రూ.11.9 కోట్లతో గోవర్దనగిరి నుంచి చర్లతండా వరకు రోడ్డు నిర్మాణం, 3.7కోట్లతో నక్కపొక్కల తండా సామ్యకుంట తండా నుంచి రఘునాథపల్లిలోని దుర్గాతండా పోతరాజుగండి తండా వయా నిర్మించిన బీటీ రోడ్డు ప్రారంభోత్సవం, స్టేషన్ ఘన్‌పూర్ గ్రామపంచాయితీని

## పదో తరగతి విద్యార్థులకు 'ఆల్ ది బెస్ట్' చెప్పిన

## ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్




★ ఏపీలో మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకు టెన్త్ క్లాస్ పరీక్షలు

★ టెన్త్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలన్న నారా లోకేశ్

★ సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచన

అమరావతి : ఏపీలో రేపటి నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. మార్చి 17వ తేదీ నుంచి ఏప్రిల్ 1 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. ఈ క్రమంలో, రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న

## ముఖ్యమంత్రి మాట్లాడే బూతులకు

## జీఎస్టీ వేస్తే రాష్ట్ర ఖజానా కూడా సరిపోదు

సీఎం రేవంత్ రెడ్డిపై హరీష్ రావు విమర్శలు

రుణమాఫీపై గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని వెల్లడి

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్

బీఆర్ఎస్ పార్టీ డేటాను నమ్ముకుంటే, సీఎం రేవంత్ మాత్రం డర్టీ ట్రిక్స్ నమ్ముకున్నారని ఆరోపించారు.

రైతు బంధు పథకాన్ని ఐక్యరాజ్యసమితి సైతం ప్రశంసించిందని గుర్తు చేశారు.




హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ డేటాను నమ్ముకుంటే, సీఎం రేవంత్ మాత్రం డర్టీ ట్రిక్స్ నమ్ముకున్నారని ఆరోపించారు. ఎలాంటి తప్పు చేయకున్నా జగదీశ్ రెడ్డిని ఏకపక్షంగా సస్పెండ్ చేయడం దారుణమని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన భాషపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఎం బూతులకు జీఎస్టీ వేస్తే రాష్ట్ర ఖజానా మొత్తం సరిపోదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ చావును కోరుకున్న రేవంత్, ఆ తర్వాత మాట మార్చి బీఆర్ఎస్ ను అన్నానని చెప్పడం సిగ్గుచేటన్నారు. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న జానారెడ్డిని




## ధనిక రాష్ట్రమైన తెలంగాణను

## కేసీఆర్ దివాలా తీయించారు

స్టేషన్ ఘనపూర్ లో ప్రజాపాలన సభ

హాజరైన రేవంత్ రెడ్డి

తెలంగాణ ఉద్యమానికి ఈ ప్రాంతం పురిటిగడ్డ అని వెల్లడి

హైదరాబాద్: తెలంగాణలో ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందని, రాణి రుద్రమదేవి, సమ్మక్క సారలమ్మ వంటి వీరనారీమణులు పాలించిన

## జనసేన పార్టీని 'ఆంధ్ర మత సేన'గా మార్చారు

## పవన్ కల్యాణ్ పై షర్మిల విమర్శలు

★ ఇటీవల జనసేన ఆవిర్భావ సభలో పవన్ వ్యాఖ్యలు

★ పవన్ వ్యాఖ్యలపై స్పందించిన షర్మిల

★ పవన్ ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని నరనరానా జీర్ణించుకున్నట్టుందని విమర్శలు



అమరావతి: జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవల జనసేన ఆవిర్భావ సభలో

## ఈ ఉగాది నుంచే పీ4 విధానం అమరావతిలో

# 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం

★ ఉండవల్లిలోని సీఎం నివాసంలో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం

★ పొట్టి శ్రీరాములు ప్రతిమకు పూలదండ వేసి నివాళు లర్పించిన చంద్రబాబు

★ ప్రతీ ఒక్కరూ 10 మంది తెలుగు వారిని ఆర్థికంగా పైకి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.

★ 125వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించ చనున్నట్లు వెల్లడించారు.




అమరావతి : పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ఈ ఉగాది నుంచి పీ4 విధానాన్ని ప్రారంభించనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. తెలుగుజాతి కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసిన స్ఫూర్తితో ప్రతీ ఒక్కరూ 10 మంది తెలుగు వారిని ఆర్థికంగా పైకి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. అమరావతిలో 58 అడుగల శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేస్తామన్న సీఎం అమరజీవి నివాసాన్ని మ్యూజియంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. 12 నెలలు 12 కార్యక్రమాలతో పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో 2047 నాటికి రాష్ట్రాన్ని నెంబర్ వన్ చేస్తామని, శ్రీ పొట్టి శ్రీరాములు స్వగ్రామంలో ఆధునిక వసతులతో ఆరోగ్య కేంద్రం, హైస్కూల్ నిర్మిస్తామని సీఎం చెప్పారు. ఉండవల్లి నివాసంలో నిర్వహించిన శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వచ్చే పొట్టి శ్రీరాములు జయంతి నాటికి 58 అడుగుల ఎత్తుతో విగ్రహ నిర్మాణం పూర్తిచేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. అమరావతిలోనే మెమోరియల్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామస్తుల విన్నపం మేరకు బకింగ్ హామ్ కెనాల్‌పై బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జనం కోసం, తెలుగు జాతి కోసం పొట్టి శ్రీరాములు బతికారని సీఎం కొనియాడారు.


## 'రైసినా డైలాగ్'

## ప్రారంభించనున్న ప్రధాని మోదీ

● 125 దేశాల నుంచి 3,500 మందికిపైగా ప్రతినిధుల రాక- ప్రధాన ఎజెండా ఇదే!

● ప్రపంచ రాజకీయ, ఆర్థిక అంశాలపై చర్చకు వేదికగా రైసినా డైలాగ్ సదస్సు నిలువనుంది.

● అంతర్జాతీయ సమాజంలో రాజకీయ అవాంతరాలు, సవాళ్లపై ప్రధానంగా చర్చించనున్నారు.



2025 : భారత్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'రైసినా డైలాగ్' సదస్సును ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం దిల్లీలో ప్రారంభించనున్నారు. దీనిలో 125 దేశాల ప్రతినిధులు పాల్గొననున్నారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును భారత విదేశాంగ శాఖ సంయుక్త భాగస్వామ్యంతో అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఓఆర్?ఎఫ్?) నిర్వహిస్తోంది. ప్రపంచ రాజకీయ, ఆర్థిక అంశాలపై చర్చకు వేదికగా రైసినా డైలాగ్ సదస్సు నిలువనుంది. 'కాల చక్ర – ప్రజలు, శాంతి, భూగ్రహం' అనే థీమ్‌తో ఈసారి సదస్సును నిర్వహిస్తున్నారు. పదోసారి జరగబోతున్న ఈ సదస్సులో పాల్గొనే ప్రముఖుల జాబితాలో న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సాన్, అమెరికా జాతీయ నిఘా విభాగం డైరెక్టర్ తులసీ గబార్డ్, ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సైబిహా తదితరులు ఉన్నారు. ఈ సదస్సులో న్యూజిలాండ్ ప్రధాని కీలకోపన్యాసం చేయనున్నారు. రష్యా – ఉక్రెయిన్ మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదిర్చేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిద్ధమయ్యారు. ఈ తరుణంలో భారత్‌కు ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి వస్తుండటం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

### తైవాన్ నుంచి సైతం

మునుపెన్నడూ లేని రీతిలో భారత్–తైవాన్ సంబంధాలు బలోపేతం అవుతున్నాయి. ఈక్రమంలో తైవాన్‌కు చెందిన ఓ సీనియర్ భద్రతా అధికారి సారథ్యంలోని

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సోమవారం 17 - 03 - 2025

## పదో తరగతి విద్యార్థులకు 'ఆల్ ది బెస్ట్' చెప్పిన ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

మొదటి పేజి తరువాయి

విద్యార్థులకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. టెన్త్ క్లాస్ విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని కోరుకుంటున్నానని ఆల్ ది బెస్ట్ చెప్పారు. విద్యార్థులు నియమనిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని లోకేశ్ సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుని పరీక్షలు పూర్తి చేయాలని అన్నారు. కాగా, ఏపీలో ఈసారి పదో తరగతి పరీక్షలకు మొత్తం 6,49,275 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3,450 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ఎగ్జామ్ సెంటర్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు మొత్తం 6 సబ్జెక్టులకు గాను 7 పేపర్లు పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

## ధనిక రాష్ట్రమైన తెలంగాణను కేసీఆర్ దివాలా తీయించారు

మొదటి పేజి తరువాయి

నేల ఇది అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి ఈ ప్రాంతం పురిటిగడ్డ అని ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మామునూరు ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చామని, ఇప్పుడుది నిలుపుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో రూ.800 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిందని ఆయన విమర్శించారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణను కేసీఆర్ దివాలా తీయించారని మండిపడ్డారు. ఉచిత కరెంటు పేరుతో డిస్కంలకు భారీగా బకాయిలు పెట్టారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్లను అందిస్తోందని ఆయన గుర్తు చేశారు. ఇప్పటివరకు 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని ఆయన వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రధాన కారణమైన ఉద్యోగ నియామకాలు వేగంగా జరుగుతున్నాయని, ఒక్క సంవత్సరంలోనే 55 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయం గత ప్రభుత్వం చేసిన అప్పులకు సరిపోవడం లేదని, అయినప్పటికీ సంక్షేమ పథకాలకు నిధులు ఆపడం లేదని ఆయన స్పష్టం చేశారు. కడియం శ్రీహరి నిజమైన నాయకుడని, ఆయన తన కోసం ఎలాంటి పైరవీలు చేయకుండా ప్రజల కోసమే పథకాలు అడుగుతారని రేవంత్ రెడ్డి కొనియాడారు. కడియం కావ్యను ఎంపీగా గెలిపిస్తే పార్లమెంటులో కొట్లాడి వరంగల్‌కు ఎయిర్‌పోర్టు, ఖాజీపేటకు రైల్వే డివిజన్‌ను తీసుకువచ్చిందని ఆయన అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును లక్షల కోట్లు పెట్టి నిర్మించినా అది మూడేళ్లు కూడా నిలబడలేదని, అది కాళేశ్వరం కాదని కూలేశ్వరం అని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులు ఎన్ని, బీఆర్‌ఎస్ నిర్మించినవి ఎన్నో చర్చకు సిద్ధమా? అని కేసీఆర్‌కు ఆయన సవాల్ విసిరారు.

## జనసేన పార్టీని 'ఆంధ్ర మత సేన'గా మార్చారు పవన్ కల్యాణ్ పై షర్మిల విమర్శలు

మొదటి పేజి తరువాయి

పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యల పట్ల ఆమె స్పందించారు. పవన్ కల్యాణ్ ... చేగువేరా, గద్దర్ అన్న సిద్ధాంతాలకు నీళ్ళొదిలేశారని... ఇప్పుడు ఆయన మోదీ, అమిత్ షా సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకున్నారని విమర్శించారు. పవన్ మాటలు చూస్తుంటే ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని నరనరాన జీర్ణించుకున్నట్టు కనిపిస్తోందని పేర్కొన్నారు. జనసేన పార్టీని 'ఆంధ్ర మత సేన' పార్టీగా మార్చారని వ్యాఖ్యానించారు. "జనసేన... జనం కోసం పుట్టిన పార్టీ అని చెప్పి ఒక మతానికి అజెండాగా మార్చడం దారుణం. సర్వమత సమ్మేళనంగా విరాజిల్లుతున్న ఆంధ్ర రాష్ట్రంలో విభజించు పాలించు అన్నట్లుగా మీ వైఖరి ఉండటం విచారకరం. పార్టీ పెట్టి 11 ఏళ్లు పోరాడి, ఉప ముఖ్యమంత్రిగా భాద్యతలు చేపట్టి, మతం రంగు పూసుకుని, ఒకరి ప్రయోజనాలే లక్ష్యం అన్నట్లుగా మాట్లాడటాన్ని కాంగ్రెస్ పార్టీ తరపున ఖండిస్తున్నాం. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలతో పుట్టిన పార్టీ అని చెప్పి, మత పిచ్చి బీజేపీ ఆశయాలను అలవరుచుకోవడం దురదృష్టకరం. ఉప ముఖ్యమంత్రి పవన్ ఇప్పటికైనా మేల్కొని, బీజేపీ మైకం నుంచి బయట పడాలి" అని షర్మిల హితవు పలికారు.

## ఆ స్కాంలన్నీ బలాదూర్!

ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్మోహన్‌రెడ్డి చేసిన పాపాలు ఇప్పుడు శాపాలుగా మారి ఆయనను చుట్టుకోబోతున్నాయా? నాటి పాపాలలో చేదోడు వాదోడుగా ఉండిన వాళ్లు ఇప్పుడు అడ్డం తిరిగి ఆయా కేసులలో కుండబద్దలు కొట్టినట్టు అప్పుడు ఏమి జరిగిందో విచారణాధికారులకు చెప్పేయబోతున్నారా? మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తాజాగా చేసిన ప్రకటన ఈ అనుమానాలను రేకెత్తిస్తోంది. జగన్‌రెడ్డి హయాంలో చోటుచేసుకున్న మద్యం కుంభకోణంలో కర్త, కర్మ, క్రియ కసిరెడ్డి రాజశేఖరరెడ్డి అని, కాకినాడ పోర్టు యాజమాన్యం చేతులు మారడంలో కర్త, కర్మ, క్రియ ప్రస్తుత ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్‌రెడ్డి అని విజయసాయిరెడ్డి తేల్చిచెప్పారు. భయం అనేది తన రక్తంలో లేదని, అప్పట్లో ఏం జరిగిందో విచారణాధికారుల ఎదుట చెప్పేస్తానని కూడా ఆయన స్పష్టంచేశారు. మరోవైపు మద్యం కుంభకోణంపై విచారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. మద్యం కొనుగోళ్లలో అప్పట్లో కీలకంగా వ్యవహరించిన వాళ్లు ఒక్కొక్కరుగా న్యాయాధికారి ఎదుట 164 కింద వాంగ్మూలం ఇస్తున్నారు. ఈ క్రమంలో సత్యప్రసాద్ అనే అధికారి ఇచ్చిన వాంగ్మూలం కీలకంగా మారనుంది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో అప్పటి ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాతో పాటు కేసీఆర్ కుమార్తె కవిత ప్రభృతులు జైలుకు వెళ్లి వచ్చారు. తాజాగా కేరళ, తమిళనాడులో చోటుచేసుకున్న మద్యం కుంభకోణాలు కలకలం సృష్టిస్తున్నాయి. అవన్నీ ఒక ఎత్తు కాగా ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి పాలనలో చోటుచేసుకున్న మద్యం కుంభకోణం లోతుల్లోకి వెళుతున్నప్పుడు విచారణ అధికారులకు కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఒకటి కాదు%-%రెండు కాదు.. ఐదేళ్లలో పది వేల కోట్లకు పైగా చేతులు మారినట్టు ఇప్పటివరకు జరిగిన విచారణలో స్పష్టమవుతోంది. యావత్ దేశం బిత్తరపోయేలా చోటుచేసుకున్న ఈ కుంభకోణంలో కర్త, కర్మ, క్రియ కసిరెడ్డి రాజశేఖరరెడ్డి అని విజయసాయిరెడ్డి చెబుతున్నప్పటికీ సొమ్ములు మాత్రం తాడేపల్లి ప్యాలెస్‌కు ప్రవహించాయని తేటతెల్లమవుతోంది. 2019లో అధికారంలోకి వచ్చిన నెల రోజుల నుంచే ఈ కుంభకోణానికి సంబంధించిన స్కెచ్‌ను అమలు చేశారు. దీన్నిబట్టి తాము అధికారంలోకి వస్తే ఏయే రంగాలలో ఎంతెంత దోచుకోవచ్చో జగన్ అండ్ కో ముందుగానే స్కెచ్ రూపొందించుకున్నారని అర్థమవుతోంది. అవినీతి కేసులలో అరెస్టయి పదహారు నెలలు జైల్లో గడిపిన జగన్‌రెడ్డి, ఆ సమయంలో భవిష్యత్తులో అధికారం లభిస్తే ఏం చేయాలో బ్లూ ప్రింట్ రూపొందించుకున్నారని ఆయనతో అప్పట్లో సన్నిహితంగా ఉన్నవాళ్లు చెబుతారు. సంక్షేమం పేరిట ప్రజలను మాయ చేస్తూ చాటుగా ఎలా దోచుకోవాలో ప్రణాళికలు రూపొందించుకున్నారట. ఈ కారణంగానే 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయా రంగాలలో దోపిడీకి తెర తీశారు. మామూలుగా అయితే కొత్తగా అధికారంలోకి వచ్చినవాళ్లు పరిస్థితులను ఆకళింపు చేసుకోవడానికి కనీసం ఆరు నెలలు సమయం పడుతుంది. దోచుకోవడానికి ఉన్న అవకాశాలను గుర్తించడానికి కూడా సమయం పడుతుంది. ముఖ్యమంత్రిగా పద్నాలుగేళ్ల పాటు పనిచేసిన చంద్రబాబు కూడా ఇప్పుడు పరిస్థితులను చక్కదిద్దడానికి ఆరు నెలలకు పైగా సమయం పట్టిందని చెబుతున్నారు. అలాంటిది ముఖ్యమంత్రిగా ఏ మాత్రం అనుభవం లేని జగన్‌రెడ్డి మాత్రం ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన నాటి నుంచే తాను రూపొందించుకున్న దోపిడీ స్కెచ్‌ను అమలు చేయడం మొదలు పెట్టారు. ఈ స్కెచ్ అమలులో సహకరించే అధికారులను గుర్తించి అంతే వేగంగా ఆయా స్థానాలలో నియమించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఏయే అధికారులను ఏయే పోస్టులలో నియమించాలో నిర్ణయించుకొని అంతా సెట్ చేసుకున్నారు. అందుకే ఒక్క రోజు కూడా ఆలస్యం చేయకుండా అధికారంలోకి రాగానే దోపిడీ మొదలుపెట్టారు. మద్యం కుంభకోణం ఒక్కటి చాలు నాటి పాలకులు ఎంతటి ఘనాపాటీలో చెప్పడానికి! రజత్ భార్గవ వంటి సీనియర్ ఐఏఎస్ అధికారులు కూడా ఈ కుంభకోణం సాఫీగా జరగడానికి తమ వంతు సహాయ సహకారాలు అందించారంటే ఆ స్కాం లోతు తెలుస్తోంది. పైనుంచి కింది వరకు ఎవరి వాటాలు వారికి నెలవారీగా అందేవట. ఏపీ బ్రూవరీస్ కార్పొరేషన్‌ను ప్రభుత్వ సంస్థగా కాకుండా ప్రైవేటు సంస్థలా నడిపారు. భారతి సిమెంట్‌లో పనిచేస్తున్న కిరణ్‌కుమార్ రెడ్డి అనే వ్యక్తి తన మనుషులతో మద్యం అమ్మకాలను పర్యవేక్షించేవారు. ఆయన మనుషులకు ప్రభుత్వ ఖజానా నుంచి జీతాలు చెల్లించడం హైలైట్.

ఓ డిస్టిలరీ.. 200 కోట్ల బంగారం!

ఈ మద్యం కుంభకోణంపై చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ అధికారులు బృందాలుగా విడిపోయి విచారణ జరుపుతున్నారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నవారు న్యాయాధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో విస్తుగొలిపే విషయాలు వెలుగుచూస్తున్నాయి. తాడేపల్లి ప్యాలెస్ నుంచి అందిన ఆదేశాల ప్రకారం బ్రూవరీస్ కార్పొరేషన్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు%-% విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, కసిరెడ్డి రాజశేఖరరెడ్డిలను కలిసి ఏయే డిస్టిలరీల నుంచి ఎంతెంత మద్యం కొనుగోలు చేయాలో ఆదేశాలు తీసుకునేవారు. ఈ ముగ్గురి కనుసన్నల్లోనే అంతా జరిగేదట! ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాత్ర నేరుగా ఎక్కడా కనిపించేది కాదు. కానీ, ఆదేశాలు తాడేపల్లి ప్యాలెస్ నుంచే వచ్చేవి. డిస్టిలరీస్ నుంచి లభించిన ముడుపులను కూడా మూల విరాట్ ఆదేశాల ప్రకారం ఎక్కడకు చేర్చాలో అక్కడకు చేర్చేవారు. మద్యం మాఫియా అంటే ఇది కదా? హవాలా వ్యాపారానికే మెళకువలు నేర్పించిన మనుషులు వీళ్లు. హైదరాబాద్‌లోని ఒక డిస్టిలరీ యాజమాన్యం 200 కోట్ల రూపాయలతో దాదాపు మూడున్నర క్వింటాళ్లు, అంటే 350 కిలోల బంగారు నాణేలను కొనుగోలు చేసింది. పద్మావతి జ్యువెలర్స్ అనే సంస్థకు సదరు డిస్టిలరీ నుంచి 200 కోట్ల రూపాయలు చెక్కు రూపంలోనే అందాయి. ఆ డబ్బు తీసుకున్న పద్మావతి జ్యువెలర్స్ సంస్థ 350 కిలోల బంగారాన్ని నాణేలుగా మార్చి అందజేసింది. సదరు బంగారాన్ని అహ్మద్ అనే వ్యక్తికి ఇవ్వవలసిందిగా సదరు డిస్టిలరీ కంపెనీ ఆథరైజేషన్ లేఖను పద్మావతి జ్యువెలర్స్‌కు ఇచ్చింది. బంగారు నాణేలు తీసుకున్న అహ్మద్ అనే వ్యక్తి వాటిని ఎవరికి అందజేసి ఉంటారో తదుపరి విచారణలో తేలుతుంది. ఏ డిస్టిలరీ కంపెనీ అయినా ముడి సరుకు కొంటుంది. బంగారం ఎందుకు కొంటుంది? అది కూడా 200 కోట్ల రూపాయలతో దాదాపు 350 కిలోల బంగారం ఎందుకు కొంటుంది? దీన్నిబట్టి ఈ కుంభకోణంలో ఎన్ని వేల కోట్ల రూపాయలు చేతులు మారాయో అర్థం చేసుకోవచ్చు. ఒక్క డిస్టిలరీకి సంబంధించిన మొత్తం ఇంత ఉంటే మిగతా డిస్టిలరీల నుంచి ఇంకెంత మొత్తం చేతులు మారిందో ఊహించుకోవచ్చు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో మొత్తం 200 కోట్లు మాత్రమే ముడుపులుగా అందాయని దర్యాప్తు సంస్థలు తేల్చాయి. ఇక్కడ ఒక్క డిస్టిలరీనే 200 కోట్లతో బంగారం కొన్నది. అంటే కుంభకోణం ఎంత పెద్దదో, ఎన్ని వేల కోట్ల రూపాయలు చేతులు మారాయో అంచనా వేయడం కష్టం కాదు.

## మా ప్రభుత్వం వచ్చాకే.. వరంగల్‌కు ఎయిర్‌పోర్ట్, రింగ్‌రోడ్డు వచ్చాయి...

మొదటి పేజి తరువాయి



ముసిపాలిటీగా అప్ గ్రేడ్ చేయడం వంటివి ఉన్నాయి. ఇంకా వీటితో పాటు.. మరికొన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వాటి గురించి పూర్తి వివరాలు ఇక్కడ తెలుసుకోండి.

అసెంబ్లీకి రాకుండా.. జీతం తీసుకుండు.. సీఎం రేవంత్

సరసమైన ప్రీమియంతో ?1 కోటి టర్మ్ ప్లాన్ కోసం అర్హతను తనిఖీ చేయండి

అసెంబ్లీకి రాకుండా.. జీతం తీసుకుండు.. సీఎం రేవంత్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా రూ. 800 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. రూ.102.1 కోట్లతో మహిళాశక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాలకు మంజూరు చేసిన ఏడు ఆర్టీసీ బస్సులను లబ్ధిదారులకు అందజేశారు. వేదిక వద్ద వివిధ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి స్టాళ్లను సందర్శించారు. అనంతరం ప్రజాపాలన బహిరంగ సభలో పాల్గొన్నారు. అనంతరం స్టేషన్ ఘనపూర్ శివారు శివునిపల్లిలో ప్రజా పాలన సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు.శివునిపల్లి వద్ద ప్రజాపాలన బహిరంగ సభలో దాదాపు 50 వేల మంది హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా పాల్గొన్నారు. వేసవి ఎండల నేపథ్యంలో సభా ప్రాంగణంలో జర్మన్ టెక్నాలజీ టెంట్లను వేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను ప్రారంభించారు. దీంతో పాటు.. రూ.12.9 కోట్లతో గోవర్ధనగిరి నుంచి చర్లతండా వరకు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వీటితో పాటు రూ.26 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ డివిజనల్ స్థాయి ఆఫీస్ కాంప్లెక్స్, రూ.45. 5 కోట్లతో ఘన్‌పూర్ లో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు, రూ.5.5 కోట్లతో ఘన్‌పూర్ లో డిగ్రీ కాలేజీ ఏర్పాటు వంటి పనుల్లో పాల్గొన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ఫేజ్-2లో భాగంగా రూ.148.76 కోట్లతో ఆర్‌ఎస్ ఘన్‌పూర్ ప్రధాన కాలువ సీసీ లైనింగ్ పనులు, రూ.25.6 కోట్ల వ్యయంతో స్టేషన్‌ఘన్‌పూర్ నియోకవర్గంలో 750 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. ఇక ప్రజాపాలన బహిరంగ సభలో మాట్లాడుతూ.. అసెంబ్లీకి రాకుండా కేసీఆర్ రూ.58 లక్షలు జీతం తీసుకున్నాడన్నారు. ఏనాడైన గత ప్రభుత్వం మహిళలను ఆదుకుందా.. మహిళలకు వడ్డీలేని రుణాలు ఇచ్చిందా.. అస్సలు పట్టించుకుందా అని ప్రశ్నించారు. మా అప్పులు ఎలా పెరిగాయి.. మీకు లక్ష కోట్లు ఆస్తులు ఎలా వచ్చాయి అని ప్రశ్నించారు. కొందరు దోపిడీ దొంగలకు నా మీద కొపం ఉండవచ్చు.. సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ గార్లు జాతిపితలు అవుతారు.. కానీ.. తెలంగాణను దోచుకున్న వ్యక్తి జాతిపిత ఎలా అవుతాడని మండిపడ్డరు. కేసీఆర్ అన్నింటికి బకాయిలు పెట్టి వెళ్లాడన్నారు. మా ప్రభుత్వం వచ్చాకే వరంగల్ కు ఎయిర్ పోర్ట్ వచ్చిందని.. వరంగల్ కు ఔటర్ రింగ్ రోడ్డు కూడా మా ప్రభుత్వం వచ్చాకే వచ్చిందన్నారు. అంతే కాదు.. మా ప్రభుత్వం వచ్చాకే కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వచ్చిందన్నారు. రైతురుణమాఫీ చేసినందుకు నాపై కోపం ఉంటుందా..? లక్ష కోట్లు సంపాదించే నైపుణ్యం ఏంటో మా యువతకు నేర్పాలన్నారు.

## 'రైసినా డైలాగ్' ప్రారంభించనున్న ప్రధాని మోదీ

మొదటి పేజి తరువాయి



టీమ్ కూడా 'రైసినా డైలాగ్' సదస్సుకు విచ్చేయనుంది. 125 దేశాలకు చెందిన మంత్రులు, మాజీ ప్రభుత్వాధినేతలు, మిలిటరీ కమాండర్లు, జర్నలిస్టులు, ప్రొఫెసర్లు, స్కాలర్లు, విదేశాంగ వ్యవహారాల పరిశీలకులు సహా దాదాపు 3,500 మందికిపైగా ఇందులో పాల్గొని కీలక అంశాలను చర్చించబోతున్నారు. దాదాపు 20 దేశాల విదేశాంగ మంత్రులు 'రైసినా డైలాగ్'లో పాల్గొంటారని సమాచారం. స్లొవేనియా, లగ్జంబర్గ్, లీచ్ టెన్‌స్టీన్, లాత్వియా, మాల్దోవా, జార్జియా, స్వీడన్, స్లోవక్ రిపబ్లిక్, భూటాన్, మాల్దీవ్స్, నార్వే, థాయ్‌లాండ్, ఆంటిగ్వా, బార్బుడా, పెరూ, ఘనా, హంగరీ, మారిషస్ దేశాల విదేశాంగ మంత్రులు సదస్సుకు హాజరు కానున్నారు. క్యూబా డిప్యూటీ ప్రధానమంత్రి మార్టినెజ్ డియాజ్, ఫిలిప్పీన్స్ విదేశాంగ శాఖ మంత్రి ఎన్రిక్ ఎ.మనాలో సైతం ఢిల్లీకి వస్తున్నారు.

### ఈ ఆరు అంశాలపై ప్రధాన చర్చ

'రైసినా డైలాగ్' సదస్సులో ప్రధానంగా 6 అంశాలపై మూడు రోజుల పాటు సమగ్రంగా చర్చించనున్నారు. అంతర్జాతీయ సమాజంలో రాజకీయ అవాంతరాలు, సవాళ్లపై ప్రధానంగా చర్చించనున్నారు. ఈ మార్పులను ఎలా తట్టుకోవాలనే దానిపై చర్చ జరగనుంది. ఆర్థిక, వాణిజ్య, రాజకీయపరమైన వ్యవహారాల్లో ప్రతిష్ఠంభన తొలగాలంటే, ఎవరు? ఎక్కడ? ఎలా? అనే మూడు అంశాలపై ప్రపంచ దేశాలు స్పష్టతకు రావాలి. ఈ దిశగా చర్చలు జరగనున్నాయి.ఇది డిజిటల్ యుగం. ప్రపంచ దేశాల నిఘా సంస్థలు, దర్యాప్తు సంస్థలు, వాటి ఉన్నతాధికారులు డిజిటల్‌గా సమన్వయం చేసుకునేలా వ్యవస్థల ఏర్పాటుపై చర్చ జరగనుంది. ఉగ్రవాదం కట్టడిపై చర్చించనున్నారు. దీనిపై కలిసికట్టుగా పనిచేసేందుకు సరైన వ్యూహాలను సిద్ధం చేయనున్నారు. ప్రగతి పయనంలో కలిసికట్టుగా నడవాలనే భావనపై వివిధ దేశాల ప్రతినిధులు చర్చించనున్నారు. ఇందుకోసం కొత్త ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. ప్రపంచ శాంతిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించే అంశాలపై ఈ సదస్సులో చర్చిస్తారు. ఇందుకు దోహదపడే సంస్థలు, ప్రతినిధులకు ప్రోత్సాహం, వారిని సమన్వయం చేయడంపై దృష్టి పెడతారు.

## ముఖ్యమంత్రి మాట్లాడే బూతులకు జీఎస్టీ వేస్తే రాష్ట్ర ఖజానా కూడా సరిపోదు

మొదటి పేజి తరువాయి



కేసీఆర్ ఎప్పుడూ గౌరవంగా సంబోధించేవారని గుర్తు చేశారు. రుణమాఫీపై రేవంత్ ప్రభుత్వం గోబెల్స్ ప్రచారం చేస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. సంపూర్ణ రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే తాను ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు. రాష్ట్ర భవిష్యత్తు పట్ల కేసీఆర్ కు, బీఆర్‌ఎస్ పార్టీకి బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని జీఎస్డీపీలో నంబర్ వన్ గా, తలసరి ఆదాయంలో అగ్రస్థానంలో నిలిపామని గుర్తు చేశారు. విద్యుత్ వినియోగంలో, వరి ధాన్యం ఉత్పత్తిలోనూ రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపామని చెప్పారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను బాగు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచామన్నారు. రైతు బంధు పథకాన్ని ఐక్యరాజ్యసమితి సైతం ప్రశంసించిందని గుర్తు చేశారు. రాష్ట్రం పట్ల ప్రస్తుత సర్కారుకు బాధ్యత లేని కారణంగానే ప్రాజెక్టులు అగ్గిపెట్టెల్లా కూలిపోతున్నాయని, పంటలు ఎండిపోతున్నాయని హరీశ్ రావు దుయ్యబట్టారు. రేవంత్ నిర్లక్ష్యం వల్ల రైతులు, చేనేత కార్మికులు, ఆటో కార్మికులు పిట్టల్లా రాలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పదవి కోసం కేటీఆర్ తో తాను పోటీ పడలేదని, తామిద్దరం ఉద్యమకారులమని, కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి పదవికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశామని హరీశ్ రావు స్పష్టం చేశారు. కేసీఆర్ ఆదేశాలను తు.చ తప్పకుండా పాటించే క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలమని అన్నారు. రాష్ట్రానికి పట్టిన శని లాంటి రేవంత్ రెడ్డి పీడను వదిలించడానికి తాము పోటీ పడతామని హరీశ్ రావు తేల్చి చెప్పారు. రాష్ట్ర ప్రజలకు న్యాయం చేయడం కోసం, మేలు చేయడం కోసం, ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు ఆయన వెంటపడతామని అన్నారు. ముక్కు పిండి మరీ మహాలక్ష్మి కింద రూ.2500 ఇప్పించడం కోసం, రైతు రుణమాఫీ పూర్తయ్యే వరకు, రైతులకు రూ.15 వేల రైతు బంధు డబ్బులు పడే వరకు రేవంత్ రెడ్డిని వెంబడిస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ లో చేరి ఒక్కొక్కరినీ తొక్కుకుంటూ, సీనియర్లపై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టి, రూ.50 కోట్లకు పీసీసీ పదవి కొనుక్కున్నారని కొందరు చెప్పారని హరీశ్ రావు ఆరోపించారు.

## ఈ ఉగాది నుంచే పీ4 విధానం అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం

మొదటి పేజి తరువాయి



పొట్టిశ్రీరాములు చేసిన త్యాగ ఫలితమే భాషా ప్రాయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు నాంది అని గుర్తు చేశారు.

### అమరావతి నిర్మాణాలకు మరో రూ.11 వేల కోట్లు! హడ్కో సీఆర్డీఏ మధ్య ఒప్పందం

పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో పీ4 విధానం: ఏ భాష మాట్లాడేవారిని ఆ భాష వారే పాలించుకునే అవకాశం రావాలని పొట్టి శ్రీరాములు కోరుకున్నారన్న సీఎం తెలుగు భాష మాట్లాడేవారికి ప్రత్యేకంగా ఒక రాష్ట్రం కావాలని పోరాడి ఆత్మార్పణ చేశారని కొనియాడారు. పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో చేపట్టే పీ4 విధానాన్ని జయప్రదం చేస్తే సమాజంలో సుస్థిరత ఉంటుందని చంద్రబాబు అన్నారు. రాబోయే 5 ఏళ్లలో పేదరిక నిర్మూలనకు ప్రతి వ్యక్తి జీవన ప్రమాణాలను పెంచేందుకు ఇబ్బందిలేకుండా ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. పొట్టి శ్రీరాములు చనిపోయిన తర్వాత ప్రజల్లో ఆగ్రహావేశాలు రేకెత్తాక ప్రత్యేక రాష్ట్రం ఇస్తున్నామని 1952 డిసెంబర్ 19న పార్లమెంట్‌లో కేంద్రం ప్రకటించిందని సీఎం గుర్తు చేశారు. 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయనున్నట్లు ఆ ఏడాది మార్చి 25న నాటి ప్రధాని నెహ్రూ ప్రకటించారని అక్టోబర్ 1న ఆంధ్రరాష్ట్రం స్వపరిపాలనలోకి వచ్చిందన్నారు. తర్వాత తెలంగాణలో కలిసిపోవడం, మళ్లీ 2014లో రెండు రాష్ట్రాలుగా విడిపోడం జరిగిపోయిందన్నారు. అందుకే ఆయన ఆత్మబలిదానంను డిసెంబర్ 15ను ఘనంగా నిర్వహించామని సీఎం తెలిపారు. పొట్టి శ్రీరాములు త్యాగాలను గుర్తు చేసేలా ట్రస్ట్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆయన అభిమానులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

# గిర్నిబావిలో పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి



**తెలంగాణ సేనా న్యూస్ వరంగల్ :** ఈ సంధర్భంగా మాట్లాడుతూ గిర్నిబావి సెంటర్లో కొమ్మాల లక్ష్మీ నరసింహ స్వామి వారి జాతర సందర్భంగా ఆనవాయితీగా మన సంస్కృతి సాంప్రదాయాల ప్రతికగా జరగవలసిన జాతరను రాజకీయ బాల ప్రదర్శనకు వేదికగా మార్చారు.సామాన్య ప్రజల అడ్డుకోవడం బిఆర్ఎస్ పార్టీతో పాటు రాజకీయాలకు సంబంధం లేని మొక్కుకున్నటువంటి భక్తులు కూడా ఆపివేశారు మధ్యాహ్నం రెండు గంటల వరకు కాంగ్రెస్ ప్రభ బండ్లు తప్ప ఒక్క బండి కూడా నర్సంపేట నియోజకవర్గం నుంచి కొమ్మాల జాతరకి మన నియోజకవర్గ బార్డర్ దాటి పంపలేదు నిన్నటి లాఠీ చార్జ్ ఘటన మీద బిఆర్ఎస్ పార్టీ పోలీస్ అధికారులను విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం.కాంగ్రెస్ పార్టీ రౌడీ రాజకీయాలను గుండా రాజకీయాలను పోలీసులు అడ్డంపెట్టి తెరలేపింది.రెండు మూడు దశాబ్దాలు అవుతుంది ఈ ప్రాంత ప్రజలు ఘర్షణలు లేకుండా ఉన్న నర్సంపేట ను కోరుకుంటున్నారు సబ్సిడీలు కోరుకుంటున్నారు సుభిక్షంగా రెండు పంటలు పండాలని కోరుకుంటున్నారు.ఇవాళ ఎన్నడూ కూడా కొమ్మాల జాతరకి ఒకరోజు దాటిన తర్వాత బండ్లు తిరగడం అనే ఈ ఘనత కాంగ్రెస్ పార్టీని దక్కింది పోలీసులకే దక్కింది.ఎమ్మెల్యే మాధవ రెడ్డి మరియు పోలీసులు భక్తులకు క్షమాపణ చెప్పాలి.చిన్నపిల్లలు,మహిళలు ఉంటారు ఎండల తీవ్రత ఉన్నది ఎండాకాలం ప్రారంభమైంది అనే కనీస సోయి కూడా లేకపోవడం దురదృష్టకరం భారీ క్రెడింగ్ పెట్టి రోడ్లను క్లోజ్ చేసి సామాన్యులు పోవద్దు, సామాన్యమైన భక్తులను కూడా భారీ కేడింగ్ పెట్టి ఎందుకు బ్రేక్ చేశారు.మా నాయకత్వాన్ని టార్గెట్ చేసి మరి లాఠీఛార్జ్ చేసినారు కచ్చితంగా ప్రతికారం తీర్చుకుంటాం.ఆత్మ రక్షణలో మా కార్యకర్తలను కాపాడుకోవాలి దేనికి అయిన సిద్ధంగా ఉండాలి అది మా ప్రధమ కర్తవ్యం.పోలీసు వాళ్లే ఆల్ పార్టీ మీటింగ్ పెట్టినారు గత 15 రోజులు అవుతుంది మండలాల పార్టీ మీటింగ్ పెట్టినారు , చివరికి చేతులెత్తేసినారు.ఆనాడు మేము అధికారంలో ఉన్నప్పుడు నేను ఎమ్మెల్యే ఉన్నప్పుడు బండి ప్రారంభించాను ఒక్క పోలీస్ కానిస్టేబుల్ తో కూడా అక్కడ పని లేకుండా మేము ప్రజలకు ఇబ్బంది లేకుండా వన్ సైడ్ బండ్లు పెట్టి టైం ప్రకారం గా పంపించినాము నిన్న ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఏకే 47 చేతిలో పిస్టల్ పట్టుకొని ప్రజలను బెదిరించారు. లాండ్ ఆర్డర్ మీ చేతిలో లేదనే విషయం మీకు ముందే తెలుసా మీరు ఎందుకు వెపన్స్ ను ఏకే 47 ఎత్తుకొని 9 గంటల నుండి 10 గంటలకు ఒక ఏసీపి స్థాయి అధికారులు రోడ్డుమీద ఎందుకు షో చేశారు.పోలీసులకు ముందే తెలుసు కాంగ్రెస్ వాళ్లు ఆగడాలు ఉన్నాయి అని ఉదయం 11 గంటలకు %దీ=రా% పార్టీ ప్రభ బండ్లు మీరు అనుమతించారు, ఆలస్యం అయినందుకే మా నాయకత్వం పోలీసులను ప్రశ్నించారు... పోలీసులు సిగ్గుందా మీకు మొహం ఎక్కడ పెట్టుకుంటారు కాంగ్రెస్ వాళ్ళని హ్యాండిల్ చేసే దమ్ము లేని వాళ్ళు పైసలు ఇచ్చి పోస్టింగ్ వేయించుకున్నారు. సామాన్యులకు, సామాన్య ప్రజలకు రక్షణ ఎక్కడ ఉన్నది నిన్న మేమే కంట్రోల్ చేసుకుని వెళ్ళాం భక్తులకు ఇబ్బంది అవుతున్నది రోడ్ క్లోజ్ చేసినందున ఇబ్బంది పడుతున్నారు వేలాదిగా ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు చిన్నపిల్లలు ఉన్నారు విపరీతంగా వాటర్ ప్రాబ్లమ్ ఉంది కాబట్టి మనం ప్రజలకు సహకరించాలి అని చెప్పి నేనే స్వయంగా మా కార్యకర్తలను ప్రజలను వేడుకున్నాను.ప్రజల కోణంలో భక్తుల కోణంలో పోలీసులు ప్రవర్తించాలి.కాంగ్రెస్ వారికి ఇజ్జత్ లేదు పోలీసులకు బుద్ధి లేదు వాళ్ళిద్దరూ కలిసి చేసినటువంటి ఈ చిల్లర చర్యలకు ప్రజలను బలి చేయవద్దని మేమే నిన్న సంయనం పాటించాము.కొత్తగా వచ్చారు.మీ పైన గౌరవం ఉన్నది మీరు తప్పకుండా ఒక ప్రత్యేక అధికారి నియమించండి నిన్నటి ఘటన పట్ల ఖచ్చితంగా విచారణ చేసి ఎక్కడైతే ప్రొసీజర్ ల్యాప్స్ ఉన్నాయో ఎవరు తప్పు చేసారో వాళ్లపైన చర్యలు తీసుకోవాలి లేకపోతే ఇదే విధంగా నిత్యం ప్రశ్నిస్తున్న నిత్యం నిరసనలు వ్యక్తం చేస్తూనే ఉంటాం.పోలీసుల లాంటి చార్జి దృశ్యాలను సోషల్ మీడియాలో ప్రచారం చేసినోళ్ల మీద పోలీస్ కేసులు పెట్టినారు అది పోలీస్ చేసిన తప్పు.మీరు చట్టాలను గౌరవించనప్పుడు మేము కూడా గౌరవించం ఎవరెవరైతే మా కార్యకర్తల మీద లాటి ఝులయించారో వాళ్ల మీద తప్పకుండా ప్రతీకారం ఉంటది.రౌడీలతో కబ్జాకోర్లతో అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ, జనాల మీద దాడులు చేస్తాం అకారణంగా కొడతామంటే చూస్తూ ఊరుకోం.పోలీస్ స్టేషన్ లో కాంగ్రెస్ పార్టీ పైరవకార్లకు ప్రత్యేక కుర్చీ ఎందుకువేస్తున్నారు, బిఆర్ఎస్ వాళ్ళని ఎందుకు అవమాన పరుస్తున్నారో పోలీస్ వారు చెప్పాలి.అనంతరం లాఠీ చార్జిలో గాయపడిన వారిని పరమర్శించిన పెద్ది దంపతులు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, మాజీ జెడ్పి వైస్ చైర్మన్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి, క్లస్టర్ బాధ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, మండల పార్టీ నాయకులు, మరియు పార్టీ ముఖ్య నాయకులు, మాజీ సర్పంచ్ లు మాజీ ఎంపీటీసీ లు పాల్గొన్నారు.

# ఎండిన వరికి ఎకరాకు యాభై వేలు నష్టపరిహారం చెల్లించాలి

అప్పులు చేసి ఆరుగాలం కష్టపడిన రైతులను ఆదుకోండి

పంట పొలాలు ఎండి పోతున్న పట్టించుకోని పాలకులకు ఎద్దె ఏడ్చిన

యవసం రైతు ఏడ్చిన రాజ్యం నిలబడదు

అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల బిక్షపతి

సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్ జనార్ధన్



**భువనగిరి ,మార్చ్ 16 తెలంగాణ సేన న్యూస్ :** ఎండిన వరి కి ఎకరాకు యాభై వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల బిక్షపతి, సిపిఐ (ఎంఎల్ )న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్ జనార్ధన్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పంట పొలాలు ఎండిపోతున్న పట్టించుకోరా ? అని ప్రశ్నిస్తూ ,ఎద్దు ఏడ్చిన వ్యవసం, రైతు ఏడ్చిన రాజ్యం నిలువదని పేర్కొన్నారు.ప్రైవేట్ వ్యాపారుల వద్ద రైతులు వేలాది రూపాయలు వడ్డీలకు, అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి,ఆరుగాలం శ్రమించి వరి సాగు చేస్తే నీరు అందక పోవడంతో, చేతి కొచే పంటలు మొత్తం ఎండిపోయి నిండా మునిగి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతాంగం గుండెలు బాదుకుంటూ కన్నీళ్ళతో మానసిక వేదనకు లోను అవుతున్నారని, ఈలాంటి ప్రతికూల పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.ఆలేరు మండలం టంగుటూరు, కందిగడ్డ తండా,శ్రీనివాస్ పురం,కొలనుపాక గ్రామాలలో ఎండిపోయిన వరి పైరును సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు.కూలీ సంఘం (ఏ ఐ కే ఎం ఎస్)జిల్లా కమిటీల ప్రతినిధి బృందం పరిశీలించారు.ఈ సందర్భంగా బిక్షపతి,జనార్ధన్ మాట్లాడుతూ, బీ ఆర్ ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండీ కూడా ఆలేరు ప్రాంతానికి సాగు నీరును అందించే గంధమల్ల, తపాస్పల్లి మినీ ప్రాజెక్టుల ద్వారా సాగు నీరును అందించలేకపోయింది అన్నారు. గంధమల్ల ప్రాజెక్ట్ ను పూర్తి చేయకుండా తీవ్ర నిర్లక్ష్యం,మోసం చేసిందని విమర్శించారు., కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రాజెక్టుల గురించి పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తపరిచారు.ఏ ఐ కే ఎం ఎస్ జిల్లా అధ్యక్షులు,ప్రధాన ప్రధాన కార్యదర్శులు కల్లెపు అడివయ్య, బేజాడి కుమార్ లు మాట్లాడుతూ,దేశానికి అన్నం పెట్టే అన్నదాత రైతు ను పాలకులు నిట్టనిలువునా ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అంతా దాన్యమే అయినప్పటికీ సన్నాలకు మాత్రమే అయిదు వందల బోనస్ అంటూ ఆ సన్నాలకు కూడా ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు.పంట పొలాలు ఎండి. పోతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమ కుట్టినట్లు లేదని అన్నారు.ఆయా గ్రామాల రైతులు గొల్లున ఏడుస్తూ కంటనీరు పెట్టారని వారి బాధలు వర్ణనాతీతం అని ఆవేదన చెందారు.నష్టపరిహారం చెల్లించే వరకు రైతులకు అండగా నిలబడని పోరాడుతామన్నారు.పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని రైతులు ఉప్పుపాత రేస్తారని హెచ్చరించారు.రైతులు ఇక్కిరి నర్సింహులు, బండి బబిత, మాలోత్ బుజ్జి, గోధుమ సత్తయ్య, లక్ష్మీనారాయణ,కృష్ణ, మాలోత్ లాలు,మాలోత్ మోతీలాల్,మాలోత్ బోర్లాల్, మాలోత్ తులసి, మాలోత్ దసరా,మాలోత్ చిన్న,తదితర రైతుల పంట పొలాలను సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్,ప్రజా సంఘాల జిల్లా,డివిజన్ నాయకులు మామిడాల సోమయ్య, మాలోత్ మోతీలాల్,మారుజోడు సిద్దేశ్వర్, తమ్మడి అంజయ్య, మామిడాల బాల మల్లేష్, యెలగందుల సిద్దులు, మారు జోడు కుమార్, యెర్రంబెల్లి ఐలయ్య,గోధుమ కొమురయ్య,మారుజోడు నర్సింహులు, నల్ల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వైద్యంకు అధిక ప్రాధాన్యం: ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్, తెలంగాణ సేన న్యూస్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.ఆదివారం పరకాల పట్టణ కేంద్రంలో 1కోటి 43 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న అర్బన్ ప్రైమరి హెల్త్ సెంటర్ నకు పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అంతకుముందు ఆసుపత్రి పరిసర ప్రాంతాలను అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో గుంతలు చేసి మట్టి తరలించడాన్ని గమనించి ఆసుపత్రి వైద్యులను అడిగి ఆగ్రహం వ్యక్తం చేశారు మట్టి తరలించిన కాంట్రాక్టర్ పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.ఈ సందర్భంగా ఎంఎల్ఏ శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యా,వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఆధునిక వసతులతో మెరుగైన



వైద్యాన్ని అందిస్తున్నామని అన్నారు.రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఆరోగ్య బీమా కవరేజీని ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని అన్నారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేరవేయటమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని,గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలకు ఉపయోగపడే ఎలాంటి పథకం ప్రజలకు ఉపయో గపడలేదు అన్నారు.వైద్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వీడి అంకితభావంతో పనిచేసి ప్రజలకు సేవా దృక్పథం తో వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించి,పూర్తి స్థాయి వైద్యులతో మెరుగైన వైద్య సేవలు అందించేందకు కృషి చేస్తానన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చుతుందని, ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు రూ. 200 కోట్లను ప్రభుత్వం కేటాయించడం సంతోషకరమని సీఎం రేవంత్ రెడ్డి కి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకి ధన్యవాదాలు తెలిపారు.

# శ్రీశ్రీశ్రీ సీదలమ్మ జాతరకు డాక్టర్ మంత్రి సీతక్కను ఆహ్వానించిన జాతర ఉత్సవ కమిటీ



**కొత్తగూడ గంగారం తెలంగాణ సేన :** ములుగు అసెంబ్లీ మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని గ్రామం మద గూడెం లో యాప వారి ఇలవేల్పు దైవం శ్రీ శ్రీ శ్రీ సీదలమ్మ జాతర తేదీ 22 మార్చి 2025 శనివారం రోజున సాయంత్రం ఐదు గంటలకు యాపశ్రీను ఇంటి నుండి పాన్పు తెచ్చుట. తేదీ 23 మార్చి 2025 ఆదివారం రోజున దేవతకు ఆడబిడ్డలు సాయంత్రం ఐదు గంటలకు గంగా స్థానం చేయించుట తదుపరి మొక్కలు చెల్లించుట రాత్రి రెండు గంటలకు గుడి మెలుగుట తెల్లవారుజామున నాలుగు గంటలకు హారానికి పోవుట తేదీ 24 3 2025 సోమవారం రోజున సాయంత్రం ఐదు గంటలకు దేవతను వనప్రవేశం చేయునని ఇట్టి జాతరకు



తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క వారికి యాప వారి ఇలవేల్పు ఉచ్చ కమిటీ వారు ప్రత్యేక ఆహ్వాన పత్రికను అందించి ఇట్టి జాతరలో పాల్గొనాలని ఆడబిడ్డగా వారికి ప్రత్యేక ఆహ్వానాన్ని అందజేశారు. జాతర నిర్వహణ కమిటీ తలపతి యాప శ్రీను.సీమ కుమారులు యాప ముత్తమ్మ. పెద్ద వడ్డీలు చింతవంశీయులు పడిగే వడ్డేలు యాప వంశీయులు. జలకం వడ్డే యాప సుందరయ్య ఆర్థిబిడ్డ డోలి వారు ( రావుల వంశీయులు ) జాతర కార్యక్రమాలు జరుగును కావున భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని జాతరను విజయవంతం చేయాలని జాతర ఉత్సవ కమిటీ యాపవంశీయులు పిలుపునిచ్చారు.

సునీతా రిటర్న్స్
మిలమిలమెరిసిన తారా
ఆకశానమెరిసిన స్కైవుడ్ తారా!
నీవైపేచూస్తున్నాం మేంనీకోసం
తారాజి
దివినుండిభువికి రా సితారా
సురక్షితముగా ఈభూమిపైకి త్వరగారా సునీతా
భావితరాలకు స్వర్ణాక్షరంగా
మెరవాలేనువ్వు ఓసితారా
సునీతా రా త్వరగా రా
నీకిదే మాఆహ్వానం సునీతా
దివినుండిభువికి జారుతున్న తారవే
నువ్వు ఓ సునీతా
నీ తారాబలం బహుదొడ్డదే సునీతా
– గరిమెళ్ళ కాశీఅన్నపూర్ణ

# బహుజన రాజ్యాధికారానికి బీసీల నాయకత్వం అవసరం



**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** బహుజన రాజ్యాధికారానికి బీసీల నాయకత్వం అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం కాన్షీరాం జయంతి నీ పురస్కరించుకొని నగరంలోని డిక్కి సమావేశ మందిరంలో సామాజిక న్యాయ జెఏసి చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ అధ్యక్షతన ప్రత్యామ్నాయ బహుజన రాజకీయ పార్టీ అనివార్యం అనే అంశం పైన 101 మంది మేధావులతో సమావేశం జరిగింది. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు ఐక్యతతో బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేయాలన్నారు. బహుజన రాజ్యాధికారం బీసీల నాయకత్వం తోని సాధ్యమైతుందని అన్నారు. ప్రస్తుతం పరిపాలిస్తున్న పార్టీలతో సామాజిక న్యాయం జరగదని బహుజనుల రాజ్యాధికారంతోటే సామాజిక న్యాయం లభిస్తుంది అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ననుమాస స్వామి, ప్రొఫెసర్ వెంకట దాస్, డాక్టర్ ప్రవీణ్, తాళ్లపల్లి శేఖర్ గౌడ్, అడ్వకేట్ స్వర్ణలత, డాక్టర్ రాకేశ్ కిరణ్, డాక్టర్ ఆవుల వెంకటేశ్వర్లు, బత్తుల సిద్దేశ్వర్, రోజా నేత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎస్ ఆర్ కే విద్యా సంస్థల 11వ వార్షికోత్సవాలు





**ముషీరాబాద్, తెలంగాణ సేన న్యూస్, మార్చి 16 :** గాంధీనగర్ లోని సురభి బాలవిహార్ స్కూల్ లో ఎస్.ఆర్.కే గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో 'ఉడాన్ ఉత్సవ్ 2025' పేరిట నిర్వహించిన 11వ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా కేంద్ర గనుల శాఖా మంత్రి జీ. కిషన్ రెడ్డి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రిటైర్డ్ ఐఏఎస్ బి.జనార్ధన్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జి. భరత్ గౌడ్, గాంధీనగర్ డివిజన్ పావని వినయ్ కుమార్, అబ్బాస్, డాక్టర్ ఫణిపవన్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. ఆడా, మగా అంటూ పిల్లల పట్ల వివక్ష చూపించవద్దని తల్లిదండ్రులకు సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థి చదువుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఎస్ ఆర్ కే గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ బడ్జెట్ స్కూల్స్ ఏర్పాటు చేసిన తాము పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. ఎస్ ఆర్ కె గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మన్ శివరామకృష్ణ ఆచార్య మాట్లాడుతూ తన తుది శ్వాస వరకు విద్యార్థులకు చదువుని అందించడమే లక్ష్యమని అన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



**శాలిగౌరారం మార్చి 16,తెలంగాణ సేన :** శాలిగౌరారం విజ్ఞాన జ్యోతి హై స్కూల్ లో చదువుకున్న 2006– 2007 ఎస్ ఎస్ సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం శాలిగౌరారం లోని జి బి ఎం ఫంక్షన్ హాల్ లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 60 మంది విద్యార్థిని విద్యార్థులు 18 సంవత్సరాల తర్వాత అందరు కలుసుకోవడం వారి మధుర జ్ఞాపకాలు స్మరించుకొని ఒకరినొకరు ఆప్యాతగా పలకరించుకున్నారు.ఆనాడు పాఠశాల లో భోదించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానం చేసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు మెమో%శీ%టోస్ అందజేశారు.. వారి గత అనుభవాలు ఇప్పుడు ఉన్న స్టేటస్ ను తెలుపుకుంటూ సంతోష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అప్పటి హెచ్ ఎం, కరస్పాండెంట్ బుడిగె శ్రీనివాస్, ఉపాధ్యాయులు కొయ్యడ శివశంకర్,పడాల అంతయ్య,కోడవటికంటి సుబ్రమణ్య శర్మ,రావుల వీరయ్య,బెల్లంకొండ స్వామి, చెవుగాని సత్యనారాయణ, మద్ది శశిధర్ రెడ్డి, ఖాజా, అరుణ, రజిత, లక్ష్మి, రేఖ, ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన గృహప్రవేశం





**కొత్తగూడ తెలంగాణ సేన :** మండలంలోని మోకాళ్ళపల్లిలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ యువ నాయకులు కుంజ కుసుమాంజలి సూర్య వారి నూతన గృహప్రవేశం సందర్భంగా... పూజా కార్యక్రమంలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ అనసూయ సీతక్క వారి మాతృమూర్తి ధనసరి సమ్మక్క సమ్మయ్య ల ఆశీస్సులు తీసుకొని కుంజ కుసుమాంజలి సూర్యలను ఆశీర్వదించిన సీనియర్ జర్నలిస్ట్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రతినిధి మెరుగు శ్రీనివాస్ , గౌరవ రిటర్మెంట్ టీచర్ వాసం కుమారస్వామి.

# జ్ఞాపకశక్తి పెంపొందించే సలహా సూచనలు చేయండి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సపోర్టర్ ఎఫ్ ఎల్ ఎన్ ప్రోగ్రాం ప్రారంభంలో కలెక్టర్ హనుమంతరావు



**భువనగిరి, తెలంగాణ సేన న్యూస్ :** జ్ఞాపక శక్తి పెంపొందించే సలహా సూచనలతో విద్యార్థులను తీర్చిదిద్దాలని కలెక్టర్ హనుమంత రావు సూచించారు. విద్యార్థులకు మంచి విద్యను, సలహాలు అందించాలని అన్నారు. శనివారం బీబీనగర్ మండలంలోని జమీలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ సందర్శించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సపోర్ట్ ఎఫ్ ఎల్ ఎన్(ఎఫ్ ఎల్ ఎన్) ప్రోగ్రాముని ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు మంచి సూచనలు , సలహాలు ఇవ్వడం ద్వారా వారికి అవగాహన కలిగి జ్ఞాపకశక్తి పెరిగి చదువులో ముందు ఉంటారన్నారు. విద్యార్థులకు కలెక్టర్ స్వయంగా పలు సలహాలు ఇస్తూ నేర్పించడం జరిగింది. తదుపరి రాకేష్ అనే విద్యార్థిని కలెక్టర్ మ్యాథ్స్ సబ్జెక్టు నుండి సూటి ప్రశ్న వేయగా మంచిగా సమాధానం చెప్పడంతో విద్యార్థి మ్యాథ్స్ లో చాలా చురుకుగా ఉన్నాడని రాకేష్ ను కలెక్టర్ అభినందించారు. విద్యార్థులు అందరూ మంచిగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత పాల్గొన్నారు.

# తీవ్రమైన వేసవిలో బట్టర్ మిల్క్ దుస్తులు పంపిణి




**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** రోడ్ల పక్కన జీవనం సాగిస్తూ అనాథలు, నిరాశ్రయులకు బట్టర్ మిల్క్, దుస్తులు, నీళ్ల ప్యాకెట్స్ అందించి వాహనదారులకు, పాదచారులకు బట్టర్ మిల్క్ పంపిణి చేసాము. తీవ్రమైన వేసవిలో బట్టర్ మిల్క్ పంపిణి చేయడం వలన వాహనదారులు, పాదచారులు, నిరాశ్రయులు స్కై ఫౌండేషన్ కు కృత్ఞతలు తెలియజేసారు. ఎండతీవ్రత రోజు రోజుకు ఎక్కువ అవుతుంది, ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు, ప్రభుత్వం తక్షణమే స్పందించి హైదరాబాద్ నగరంలో అని ప్రధాన కూడలిలలో, అన్ని ఆర్ టి సి బస్సు స్టాండ్లలో చల్లని మంచి నీరు అందించే సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ కార్యక్రమములో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని సేవసభ్యులు రాజేశ్వర్ రెడ్డి, ఆంజనేయులు మొదలగు వాళ్ళు పాల్గొన్నారు.



తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సోమవారం 17 - 03 - 2025

## రూపాయి పతనం బెడిసికొడుతున్న ప్రయత్నాలు

**రూపీ ఏ 85.80**

**ఇంట్రాడేలో 53 పైసలు..చివర్లో 21 పైసల పతనం**



కరెన్సీ పతనాన్ని అడ్డుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. దీంతో రోజుకొక కనిష్ఠ స్థాయికి పడిపోతున్న విలువ శుక్రవారం ఏకంగా పాతాళంలోకి జారుకున్నది. ఇంట్రాడేలో 85.80 స్థాయికి పడిపోయిన డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు పతనాన్ని అడ్డుకోవడానికి రిజర్వుబ్యాంక్ అన్ని అస్త్రాలను సంధించడంతో చివర్లో ఈ భారీ పతనాన్ని తగ్గించుకోగలిగింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లు భారీగా పుంజుకోవడం రూపాయి పతనానికి అడ్డుకట్టవేసింది. 85.31 వద్ద ప్రారంభమైన డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఇంట్రాడేలో 53 పైసలు కుంగి చారిత్రక కనిష్ఠ స్థాయి 85.80కి జారుకున్నది. సెంట్రల్‌బ్యాంక్ జోక్యంతో భారీ నష్టాల నుంచి కోలుకొని చివరకు 21 పైసల నష్టంతో 85.48 వద్ద ముగిసింది. గడిచిన రెండేండ్లలో ఒకేరోజు ఇంతటి స్థాయిలో పతనం చెందడం ఇదే తొలిసారి. ఫిబ్రవరి 2, 2023న రూపాయి విలువ అత్యధికంగా 68 పైసలు పడిపోయిన విషయం తెలిసిందే.

## థర్డ్-పార్టీ యాప్స్‌పై పీపీఐలతో యూపీఐ పేమెంట్స్ ఆర్బీఐ అనుమతి




థర్డ్-పార్టీ మొబైల్ అప్లికేషన్స్ ద్వారా ప్రీపెయిడ్ పేమెం ట్ ఇన్‌స్ట్రుమెంట్స్ (పీపీఐ) వినియోగదారులు యూపీఐ లావాదేవీలను జరుపుకొనేందుకు ఆర్బీఐ శుక్రవారం అనుమతిచ్చింది. థర్డ్-పార్టీ యాప్స్ (ఫోన్‌పే వంటివి)ను వినియోగించి పూర్తిస్థాయి కేవైసీ కలిగిన పీపీఐ (స్మార్ట్ కార్డ్స్, గిఫ్ట్ కార్డ్స్, మెట్రో రైల్ కార్డ్స్, ఆన్‌లైన్ అకౌంట్స్, డిజిటల్ వ్యాలెట్స్ వంటివి) హోల్డర్స్ యూపీఐ పేమెంట్స్ చేయడం లేదా స్వీకరించడానికి వీలు కల్పిస్తున్నట్టు సెంట్రల్ బ్యాంక్ ఓ సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. ప్రస్తుతం థర్డ్-పార్టీ యాప్స్‌తో తమ బ్యాంక్ ఖాతాలను అనుసంధానం చేసుకొని మాత్రమే యూపీఐ పేమెంట్స్‌ను కస్టమర్లు చేసుకోగలుగుతున్నారు.

### బెడిసికొడుతున్న ప్రయత్నాలు

కరెన్సీ పతనాన్ని అడ్డుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. దీంతో రోజుకొక కనిష్ఠ స్థాయికి పడిపోతున్న విలువ శుక్రవారం ఏకంగా పాతాళంలోకి జారుకున్నది. ఇంట్రాడేలో 85.80 స్థాయికి పడిపోయిన డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు పతనాన్ని అడ్డుకోవడానికి రిజర్వుబ్యాంక్ అన్ని అస్త్రాలను సంధించడంతో చివర్లో ఈ భారీ పతనాన్ని తగ్గించుకోగలిగింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లు భారీగా పుంజుకోవడం రూపాయి పతనానికి అడ్డుకట్టవేసింది. 85.31 వద్ద ప్రారంభమైన డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఇంట్రాడేలో 53 పైసలు కుంగి చారిత్రక కనిష్ఠ స్థాయి 85.80కి జారుకున్నది. సెంట్రల్‌బ్యాంక్ జోక్యంతో భారీ నష్టాల నుంచి కోలుకొని చివరకు 21 పైసల నష్టంతో 85.48 వద్ద ముగిసింది. గడిచిన రెండేండ్లలో ఒకేరోజు ఇంతటి స్థాయిలో పతనం చెందడం ఇదే తొలిసారి. ఫిబ్రవరి 2, 2023న రూపాయి విలువ అత్యధికంగా 68 పైసలు పడిపోయిన విషయం తెలిసిందే.

## దేశీయ మార్కెట్లోకి హెూండా యూనికార్న్ 2025 రూ.1.19 లక్షలకు లభ్యం



ప్రముఖ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ హెూండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్‌ఎంఎస్‌ఐ) దేశీయ మార్కెట్లో హెూండా యూనికార్న్ 2025 ఆవిష్కరించింది. దీని ధర రూ.1,19,481 (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది. ఓబీడీ2బీ కంప్లియంట్ ఇంజిన్, అదనపు ఫీచర్లతో ఈ మోటారు సైకిల్ అప్ డేట్ చేశారు. హెూండా యూనికార్న్ 2025 మోటారు సైకిల్ 162.71సీసీ, సింగిల్ సిలిండర్, ఫ్యుయల్ %-% ఇంజెక్టెడ్ ఇంజిన్ తో వస్తోంది. ఈ ఇంజిన్ గరిష్టంగా 13 హెచ్పీ విద్యుత్, 14.58 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. 5-స్పీడ్ గేర్ బాక్స్ తో రూపుదిద్దుకున్నదీ బైక్. హెూండా యూనికార్న్ 2025 మోటారు సైకిల్ న్యూ ఆల్ -ఎల్ఈడీ హెడ్ ల్యాంప్ విత్ క్రోమ్ ఎంబెల్లిష్ మెంట్స్‌తో వస్తోంది. న్యూ ఫుల్లీ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ కన్సోల్, గేర్ పొజిషన్ ఇండికేటర్, సర్వీస్ డ్యూ ఇండికేటర్, ఎకో ఇండికేటర్, యూఎస్బీ టైప్-సీ పోర్ట్ కలిగి ఉంటుంది. సింగిల్ వేరియంట్‌గా వస్తున్న హెూండా యూనికార్న్ 2025 మోటారు సైకిల్ పెరల్ ఇగ్నియస్ బ్లాక్, మ్యాట్టె యాక్సిస్ గ్రే మెటాలిక్, రేడియంట్ రెడ్ మెటాలిక్ రంగుల్లో లభిస్తుంది.

## ఆవిష్కరించిన 11 నెలల్లోనే ఈ కారు లక్ష యూనిట్స్ క్రాస్




దక్షిణ కొరియా ఆటోమొబైల్ మేజర్ కియా ఇండియా గత జనవరిలో తన కంపాక్ట్ ఎస్‌యూవీ సోనెట్ కారును భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది. అయితే, 2024 జనవరి %-% నవంబర్ మధ్య.. అంటే ఆవిష్కరించిన 11 నెలల్లోనే 1,03,353 యూనిట్లు విక్రయించింది. మూడు ఇంజిన్ ఆప్షన్లలో కియా సోనెట్ అందుబాటులో ఉంది. స్మార్ట్ స్ట్రీమ్ జీ1.2 లీటర్ల పెట్రోల్ (83 పీఎస్/115ఎన్ఎం), స్మార్ట్ స్ట్రీమ్ 1.0 లీటర్ల టీ-జీడీఐ పెట్రోల్ (120 పీఎస్/172 ఎన్ఎం), 1.5 లీటర్ల సీఆర్డీఐ వీజీటీ డీజిల్ (116 పీఎస్/250 ఎన్ఎం) ఇంజన్ల ఆప్షన్లలో లభిస్తుంది. 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్ విత్ 1.2 పెట్రోల్, 6-స్పీడ్ ఐఎంటీ అండ్ 7-స్పీడ్ డీసీటీ విత్ 1.0 టర్బో పెట్రోల్, 6-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్, 6-స్పీడ్ ఐఎంటీ, 6-స్పీడ్ ఏటీ విత్ 1.5 డీజిల్ ఇంజన్ ఆప్షన్లలో కొనుగోలు చేయొచ్చు. మొత్తం కియా సోనెట్ కార్ల విక్రయాల్లో 76 శాతం పెట్రోల్ పవర్ ట్రైన్స్, 24 శాతం డీజిల్ పవర్ ట్రైన్స్ అమ్ముడవుతున్నాయి. వాటిల్లో 34 శాతం ఐఎంటీ ఆప్షన్ ఇంజిన్ కార్లు ఉన్నాయి. కియా సోనెట్ 10.25 అంగుళాల డిజిటల్ ఇన్ స్ట్రుమెంట్ క్లస్టర్, 10.25 అంగుళాల టచ్ స్క్రీన్ నేవిగేషన్, సరౌండ్ వ్యూ మానిటర్, ఫ్రంట్ వెంటిలేటెడ్ సీట్స్, ఎలక్ట్రిక్ సన్ రూఫ్, లెవెల్-1 అడాస్ విత్ 10 ఫీచర్స్ జత చేశారు. కియా సోనెట్ కారు ధర రూ.7.99 లక్షల నుంచి (ఎక్స్ షోరూమ్) రూ.15.77 లక్షల వరకు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది. టాటా నెక్సాన్, మారుతి సుజుకి బ్రెజా, హ్యుండాయ్ వెన్యూ, మహీంద్రా ఎక్స్ యూవీ 3ఎక్స్‌ఓ, స్కోడా కైలాక్ కార్లకు కియా సోనెట్ పోటీనిస్తుంది.

# చిన్న షేరు.. తళుక్కు!



**ఈ ఏడాది 28.45% పెరిగిన బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ**

**మిడ్‌క్యాప్ ఇండెక్స్ 25.61% అప్**

**వచ్చే ఏడాదీ కొనసాగనున్న జోరు!?**

ఈ ఏడాదీ దలాల్ స్ట్రీట్‌లో చిన్న, మ?ధ్య స్థాయి కంపెనీల షేర్లే తళుక్కుమన్నాయి. ప్రధాన కంపెనీల స్టాక్స్ కంటే ఆకర్షణీయ ప్రతిఫలాలు పంచాయి. మార్కెట్లో ఆశావహ ట్రెండ్‌తోపాటు రిటైల్ ఇన్వెస్టర్ల పాత్ర గణనీయంగా పెరగడం ఇందుకు దోహదపడింది. 2024లో ఈక్విటీ సూచీలు వరుస రికార్డుల మోత మోగించాయి. మ్యూచువల్ ఫండ్ల ద్వారా, ముఖ్యంగా క్రమానుగత పెట్టుబడుల (సిప్) రూపంలో మార్కెట్లోకి ద్రవ్య ప్రవాహం భారీగా పెరగడంతోపాటు బలమైన ఆర్థిక మూలాలు, విధానపరమైన సానుకూలత తోడ్పడ్డాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. ప్రభుత్వ విధానపరమైన చర్యలు, సానుకూల పరిస్థితులతో లబ్ది పొందిన రియల్టీ, మౌలికం, హెల్త్‌కేర్, పునరుత్పాదక ఇంధనం రంగా లు మెరుగైన పనితీరు కనబరచడం ఈ ఏడాది స్మాల్, మిడ్‌క్యాప్ సూచీల వృద్ధికి ప్రధానంగా దోహదపడ్డాయని మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ డైరెక్టర్ ఆరోరా చోప్రా అన్నారు. దేశంలో వినియోగం పుంజుకోవడంతో పాటు సాంకేతిక పురోగతి, ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాలు (పీఎల్ఐ) వంటి పథకాలతో చిన్న కంపెనీల పనితీరు మెరుగైందన్నారు. వచ్చే ఏడాదిలోనూ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ స్టాక్స్ హవా కొనసాగనుందని వారు భావిస్తున్నారు. దేశీయంగా బలమైన వినియోగం, మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం భారీగా వెచ్చిస్తుండటం ఇందుకు కలిసిరానున్నాయని వారు అభిప్రాయపడ్డారు. అయితే, స్మాల్, మిడ్‌క్యాప్ విభాగాల్లో ఇప్పటికే చాలా కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతుడటంతోపాటు కొన్ని రంగాల వృద్ధి మందగించిన నేపథ్యంలో ఇన్వెస్టర్లు పెట్టుబడుల విషయంలో కాస్త జాగ్రత్తగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆకర్షణీయ ధరకు లభిస్తున్న నాణ్యమైన స్టాక్స్‌ను ఎంచుకోవడం ద్వారా భవిష్యత్‌లో మెరుగైన ప్రతిఫలాలు అందుకునే వీలుంటుందన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు (ఈ నెల 23 నాటికి) బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 12,144.15 పాయింట్లు (28.45 శాతం) వృద్ధి చెందగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 9,435.09 పాయింట్లు (25.61 శాతం) ఎగబాకింది. కాగా, ప్రధాన కంపెనీల ప్రాతినిధ్య సూచీ బీఎస్ఈ సెన్సెక్స్ మాత్రం 6,299.91 పాయింట్లు (8.72 శాతం) పెరిగింది. ఈ నెల 12న స్మాల్‌క్యాప్ సూచీ 57,827.69 పాయింట్ల వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేయగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ సెప్టెంబరు 24న 49,701.15 వద్ద ఆల్‌టైం గరిష్ఠాన్ని రికార్డు చేసింది. కాగా, సెన్సెక్స్ రికార్డు గరిష్ఠం సెప్టెంబరు 27న 85,978.25 వద్ద నమోదైంది. 2023లో సెన్సెక్స్ 11,399.52 పాయింట్లు (18.73 శాతం) వృద్ధి చెందగా.. స్మాల్‌క్యాప్ సూచీ 13,746.97 పాయింట్లు (47.52 శాతం), మిడ్‌క్యాప్ 11,524.72 పాయింట్లు (45.52 శాతం) ఎగబాకాయి. 2022లో మాత్రం స్మాల్‌క్యాప్ 1.80 శాతం, మిడ్‌క్యాప్ 1.37 శాతం వృద్ధికి పరిమితం కాగా.. సెన్సెక్స్ 4.44 శాతం పెరిగింది.

### 2025లో రూ.2 లక్షల కోట్ల పైనే! ఐపీఓ ద్వారా నిధుల సమీకరణపై పాంటోమత్ గ్రూప్ అంచనా

అత్యధిక కంపెనీలు పబ్లిక్ ఇష్యూల (ఐపీఓ)కు వస్తున్న దేశాల్లో భారత్‌దే అగ్రస్థానం. ఈ ఏడాది అమెరికాతో పోలిస్తే రెండింతలు, యూరప్ కంటే 2.5 రెట్ల కంపెనీలు భారత్‌లో పబ్లిక్ ఇష్యూకు వచ్చాయని పాంటోమత్ గ్రూప్ అధ్యయన నివేదిక వెల్లడించింది. ఈ ఏడాదిలో నవంబరుతో ముగిసిన 11 నెలల్లో 76 కంపెనీలు ఐపీఓల ద్వారా మొత్తం రూ.1.3 లక్షల కోట్లు సమీకరించాయి. వచ్చే ఏడాది ఐపీఓ నిధుల సమీకరణ రూ.2 లక్షల కోట్ల మైలురాయిని దాటవచ్చని పాంటోమత్ గ్రూప్ అంచనా వేసింది. వచ్చే ఏడాదిలో ఆఫర్‌ను ప్రారంభించేందుకు వీలుగా 34 కంపెనీలు ఇప్పటికే సెబీ అనుమతి పొందాయని.. వాటి మొత్తం నిధుల సమీకరణ లక్ష్యం రూ.41,462 కోట్లుగా ఉందని రిపోర్టులో వెల్లడించింది. మరో రూ.98,672 కోట్ల విలువైన 55 కంపెనీల ఐపీఓలు సెబీ అనుమతి కోసం వేచి చూస్తున్నాయని.. వచ్చే ఏడాదిలో వీటికీ గ్రీన్‌సిగ్నల్ లభించే అవకాశాలున్నాయంది.

# 6 నెలలు.. రూ.21,367 కోట్లు

**2024-25 ప్రథమార్థంలో బ్యాంకుల్లో**

**8 రెట్లు పెరిగిన మోసాలు.. ఆర్‌బీఐ నివేదిక వెల్లడి**

ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా బ్యాంకుల్లో మోసాలు మాత్రం తగ్గడం లేదు. ఏదోలా మాయ చేసి కేటుగాళ్లు దర్జాగా బ్యాంకుల నుంచి కోట్లకు కోట్లు కొల్లగొడుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ఆరు నెలల్లోనే దేశంలోని బ్యాంకుల్లో 18,461 మోసపూరిత కేసులు నమోదయ్యాయి. ఈ మోసాలతో కొట్టేసిన సొమ్ము రూ.21,367 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం (2023 -24) ఇదే కాలంలో నమోదైన రూ.2,623 కోట్లతో పోలిస్తే ఇది ఎనిమిదింతలు ఎక్కువ. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గురువారం దీనికి సంబంధించి 'ట్రెండ్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ బ్యాంకింగ్ ఇన్ ఇండియా 2023-24' పేరుతో ఒక నివేదిక విడుదల చేసింది. ఈ మోసాలతో బ్యాంకింగ్ వ్యవస్థ పేరు ప్రతిష్ఠలతో పాటు నిర్వహణ, వ్యాపారపరమైన ఇబ్బందులు, వాటి ఆర్థిక స్థిరత్వం, ఖాతాదారుల నమ్మకానికి సవాల్‌గా మారాయని తెలిపింది.

### పీఎస్‌బీల వాటానే ఎక్కువ

గత ఆర్థిక సంవత్సరం దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో నమోదైన ఇంటర్నెట్, కార్డు మోసాల్లో 67.1 శాతం ప్రైవేట్ బ్యాంకుల్లో నమోదయ్యాయని ఆర్‌బీఐ నివేదిక తెలిపింది. అయితే నష్టపోయిన సొమ్ముపరంగా చూస్తే ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లే అత్యధికంగా నష్టపోయాయి. ఇటీవల కొన్ని డిజిటల్ లెండింగ్ సంస్థలు ఆర్‌బీఐ నియంత్రణలోని బ్యాంకులు, ఆర్థిక సంస్థల అనుబంధ సంస్థలమని చెప్పుకుని మోసం చేయడమూ పెరిగిపోయిందని నివేదిక పేర్కొంది. దీంతో ఈ మోసాలకు చెక్ పెట్టేందుకు ఆర్‌బీఐ మోసాలకు పాల్పడే డిజిటల్ లెండిగ్ యాప్స్





పేర్ల తో ఒక జాబితా రూపొందించేందుకు సిద్ధమవుతోంది.

### రూ.3.5 లక్షల కోట్ల నికర లాభాలు

మోసాలు పెరిగి పోతున్నా దేశంలోని వాణిజ్య బ్యాంకులు వరుసగా ఆరో సంవత్సరంలోనూ లాభాలు నమోదు చేయడం విశేషం. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో బ్యాంకులు రూ.3.5 లక్షల కోట్ల నికర లాభాలు నమోదు చేశాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోలిస్తే ఇది రూ.87,000 కోట్లు ఎక్కువ. మళ్లీ ఇందులో ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) వాటానే రూ.1.46 లక్షల కోట్లుగా ఉంది.

# ఈరోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే



దేశంలో బంగారం ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. యూఎస్ డాలర్ బలపడటం సహా పలు అంశాల నేపథ్యంలో వీటి ధరలు క్రమంగా పడిపోతున్నాయి. అయితే నేడు ఏ మేరకు తగ్గాయి, ఎంత ఉన్నాయనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం. భారతదేశంలో బంగారం(%స్త్రశీశ్రీ%), వెండి ధరలు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మారుతుంటాయి. దీంతోపాటు గ్లోబల్ మార్కెట్లో ధరలు, అంతర్జాతీయ పెట్టుబడుల ప్రవాహం, డాలర్ వ్యత్యాసాలు, దేశీయ మార్కెట్ నిర్ణయాలు కూడా ఈ ధరలను ప్రభావితం చేస్తాయి. ఈ క్రమంలో నేడు ఉదయం 6.25 గంటల నాటికి 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 76,150కి చేరుకుంది. ఇది నిన్నటితో పోల్చితే 150 రూపాయల తగ్గింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 69,804కు చేరుకుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 76,410కు చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ. 70,043కు చేరింది. ఇక రేట్ల గురించి తెలుసుకుంటే కిలో వెండి ధర రూ. 89,350 స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో దేశంలోని ప్రధాన ప్రాంతాల్లో బంగారం, వెండి రేట్ల గురించి ఇక్కడ చూద్దాం.

**దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు (10 గ్రాములకు) (24 క్యారెట్స్, 22 క్యారెట్స్)**

హైదరాబాద్‌లో రూ. 76,410, రూ. 70,043
విజయవాడలో రూ. 76,410, రూ. 70,043
ఢిల్లీలో రూ. 76,150, రూ. 69,804
చెన్నైలో రూ. 76,510, రూ. 70,134
ముంబైలో రూ. 76,290, రూ. 69,933
కోల్‌కతాలో రూ. 76,190, రూ. 69,841
వడోదరలో రూ. 76,390, రూ. 70,024

ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కిలోకు)
చెన్నైలో రూ. 89,470
ముంబైలో రూ. 89,210
ఢిల్లీలో రూ. 89,060
హైదరాబాద్‌లో రూ. 89,350
విశాఖపట్నంలో రూ. 89,350
వడోదరలో రూ. 89,330
కోల్‌కతాలో రూ. 89.090

22, 24 క్యారెట్ల మధ్య తేడా మీకు తెలుసా?

బంగారం స్వచ్ఛతను గుర్తించేందుకు %ూ% (ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) ద్వారా హాల్ మార్క్ ఇస్తారు. 24 క్యారెట్ల బంగారం 99.9% స్వచ్ఛమైనది. 22 క్యారెట్ల బంగారం దాదాపు 91 శాతం స్వచ్ఛమైనది. రాగి, వెండి, జింక్ వంటి ఇతర లోహాలను 22 క్యారెట్ల బంగారంలో 9% కలిపి ఆభరణాలు తయారు చేస్తారు. 24 క్యారెట్ల బంగారం విలాసవంతమైనది అయినప్పటికీ, దీనిని ఆభరణాలు తయారు చేయడానికి ఉపయోగించుకోలేరు. అందుకే చాలా మంది దుకాణదారులు 22 క్యారెట్ల బంగారం విక్రయిస్తారు.

**గమనిక:** పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడూ మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు తెలుసుకోవాలని సూచన.

# 2025లో జోరుగా విదేశీ పెట్టుబడులు!

**2024లో ఫారిన్ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు భారీగా వెనక్కి**

**కొత్త ఏడాదిలో మళ్లీ పుంజుకోవచ్చంటున్న మార్కెట్ విశ్లేషకులు**

గత సంవత్సరం భారత స్టాక్ మార్కెట్లో జోరుగా పెట్టుబడులు పెట్టిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ).. 2024లో తమ ఇన్వెస్ట్‌మెంట్లను భారీగా వెనక్కి తీసుకున్నారు. దాంతో ఈ ఏడాది మొత్తానికి ఎఫ్‌పీఐల నికర పెట్టుబడులు రూ.5,000 కోట్ల స్థాయికి పరిమితం కానున్నాయి. దేశీయ స్టాక్ మార్కెట్లో అధిక వాల్యువేషన్లు, అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ నిరాశపర్చడం, అమెరికాలో వడ్డీ రేట్ల తగ్గుదల కారణంగా అక్కడి బాండ్ల రేటు పెరగడం వంటి అంశాలు విదేశీ పెట్టుబడుల ఉపసంహరణకు ప్రధాన కారణమయ్యాయి. కొత్త సంవత్సరం (2025)లో ఈ పెట్టుబడుల ప్రవాహం మళ్లీ పుంజుకోవచ్చని స్టాక్ మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. మెరుగుపడనున్న కార్పొరేట్ కంపెనీల పనితీరు ఇందుకు దోహదపడనుందని వెంచురా సెక్యూరిటీస్ రీసెర్చ్ విభాగ అధిపతి వినీత్ బోలింజ్‌కర్ అన్నారు. అయితే, మన మార్కెట్లో చాలా కంపెనీల షేర్లు ఇప్పటికీ అధిక ధరల వద్ద ట్రేడవుతుండటంతో పాటు ఆసియాన్, లాటిన్ అమెరికా మార్కెట్లలో షేర్లు ఆకర్షణీయ ధరలకు లభిస్తుండటం, ప్రపంచ ఆర్థిక మాంద్యం ముప్పు, అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ సహా అభివృద్ధి చెందిన దేశాల సెంట్రల్ బ్యాంకుల వడ్డీ రేట్ల తగ్గింపు, ట్రంప్ సుంకాల వడ్డన వంటి పరిణామాలు మన మార్కెట్లోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహాన్ని పరిమితం చేసే ప్రమాదమూ లేకపోలేదన్నారు. డిపాజిటరీల వద్ద అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. ఈ నెల 24 నాటికి మన ఈక్విటీల్లో ఎఫ్‌పీఐల నికర పెట్టుబడులు రూ.5,052 కోట్లుగా నమోదయ్యాయి. డెట్ మార్కెట్లో మాత్రం రూ.1.12 లక్షల కోట్లు పెట్టుబడిగా పెట్టారు.




కాగా, 2023లో ఎఫ్‌పీఐలు మన ఈక్విటీల్లో నికరంగా రూ.1.71 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అంతక్రితం సంవత్సరం (2022)లో రూ.1.21 లక్షల కోట్లు వెనక్కి తీసుకున్నారు. 2019 నుంచి 2021 వరకు వరుసగా పెట్టుబడులు పెంచుకుంటూ వచ్చారు. ఈ ఏడాది విషయానికొస్తే, జనవరి, ఏప్రిల్, మే, అక్టోబరు, నవంబరుల్లో పెట్టుబడులను భారీగా వెనక్కి తీసుకున్నారు. కేవలం అక్టోబరు, నవంబరులో మొత్తం రూ.1.16 లక్షల కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. అంతర్జాతీయ అనిశ్చితులు, సవాళ్ల నేపథ్యంలోనూ ఈ ఏడాది భారత్‌లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) భారీగానే వచ్చాయి. ఈ జనవరి నుంచి నమోదైన నెలవారీ ఎఫ్‌డీఐల సగటు 450 కోట్ల డాలర్ల పైమాటే. 2025లోనూ ఎఫ్‌డీఐల జోష్ కొనసాగనుందని.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332